
రేపు మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశం



మహేశ్వరం, ఫిబ్రవరి 4 : మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెగూడలోని ఎస్‌వైఆర్ గార్డెన్‌లో ఉంటుందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని, నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే వేటు తప్పదు

» డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

ఆదిభట్ల, ఫిబ్రవరి 4 : పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే ఎంతటి వారికైనా క్రమశిక్షణా చర్యలు తప్పవని, ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీ ఆదేశాల మేరకు పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, ధన్‌రాజ్‌గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఆదిభట్ల మున్సిపల్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి పార్టీ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వ్యవహరించడం వల్ల సస్పెండ్ చేశామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ముంగిట అవిశ్వాసాల లొల్లి.. అదికూడా సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడం సరైంది కాదని ఆయన అన్నారు. పదవులు ముఖ్యం కాదని, పార్టీలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. సొంత పార్టీ అభ్యర్థిపై అవిశ్వాసంపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను తీసుకెళ్తుందని సూచించారు. నిరంజన్‌రెడ్డితో పాటు క్యాంపులో ఉన్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వెంటనే బయటకు వచ్చేయాలని, లేనిపక్షంలో వారిపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని చల్లా అన్నారు. ఈనెల 9న బలనిరూపణ సమయంలో పార్టీ సూచించిన అభ్యర్థికి మాత్రమే మద్దతు తెలపాలని పార్టీ విప్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అన్నారు. మాజీ సర్పంచ్ శేఖర్, జైపాల్‌రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, చిరంజీవి, రాజలింగం, యాదగిరి, సతీష్, బోస్‌పల్లి వీరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

» చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 4: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం దెబ్బడగూడ గ్రామంలో జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ. పట్టణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయన్నారు. ఇంకా వైద్యసేవలు అందని వారికి తమ ఫౌండేషన్ ద్వారా అనేక ఉచిత శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 368మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అందులో 19మందికి శస్త్ర చికిత్సలు చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు నిర్ధారించారు. దీంతో మంగళవారం వారిని అపోలో ఆస్పత్రికి తరలించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, బీజేపీ నాయకుడు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మి, నాయకులు కె.జంగారెడ్డి, చెన్నారెడ్డి, ఎస్ భూమిరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, డాక్టర్ సంతోష్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అయోధ్య రామాలయ ప్రసాదాన్ని గ్రామస్తులకు పంపిణీ చేశారు.



పెట్టుబడి సాయానికి ఎదురుచూపులు!

2023-24 యాసంగి రైతుబంధు వివరాలు

మొత్తం రైతులు : 4,04,436
జమ చేయాల్సినవి : రూ. 378.92 కోట్లు

డబ్బులు జమైన రైతుల సంఖ్య : 2,54,604
డబ్బులు రూ. 147.33 కోట్లు

ఇప్పటి వరకు కొందరి ఖాతాల్లోనే 'రైతుబంధు' జమ

» రెండెకరాల్లోపు రైతులకు అందిన నిధులు
» మిగతా వారికి తప్పని తిప్పలు
» అప్పులు తెచ్చి ఇప్పటికే సాగు చేసిన రైతులు

రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ఇప్పటి వరకు రెండెకరాల్లోపు రైతుల ఖాతాల్లోనే రైతుబంధు డబ్బులు పడ్డాయి. దీంతో మిగతా రైతులు తమ ఖాతాల్లో ఎప్పుడు పడతాయా అని చూస్తున్నారు. ఇప్పటికే పంటలు సాగు చేయడంతో బయట అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. రైతుబంధు డబ్బులు వస్తే చేసిన అప్పులు తీరుద్దామన్న ఆలోచనలో ఉన్నారు. అయితే, విడతల వారీగా అందరికీ డబ్బులు వేస్తామని ప్రభుత్వం చెప్పడంతో తమ ఖాతాల్లో ఎప్పుడు డబ్బులు పడతాయా అని నిత్యం ఖాతాలను చెక్ చేసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 : రైతుబంధు డబ్బుల కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఇప్పటి వరకు కొందరికి మాత్రమే పెట్టుబడి సాయం అందింది. ఇంకా చాలామందికి ఈ డబ్బులు రాలేదు. దీంతో వారంతా ఇప్పుడు రైతుబంధు సాయం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుబంధు స్థానంలో రైతు భరోసా పేరుతో ఏడాదికి ఎకరాకు రూ. 15 వేలు పెట్టుబడి సాయంగా అందజేస్తామని ఆ పార్టీ ప్రకటించింది. అయితే, గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే ఎకరాకు ఏడాదికి పదివేల చొప్పున పంపిణీ చేస్తోంది. యాసంగి పెట్టుబడి కింద ఎకరానికి రూ. 5వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేస్తుంది. అదికూడా ఇప్పటి వరకు అందరికీ అందలేదు. జిల్లాలో 4,04,436 మంది రైతులకు రూ. 378.92 కోట్లు జమ చేయాల్సి ఉంది. అయితే, రెండు, మూడెకరాల లోపున్న 2,54,604 మంది రైతులకు ఇప్పటి వరకు రూ. 147.33 కోట్లు జమ చేసింది. ఇంకా 1,49,832 మందికి రూ. 231.59 కోట్లు జమ చేయాల్సి ఉంది. రైతుబంధు సాయం నత్తనడకన సాగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడ్డాయేమోనని రైతులు రోజూ తమ ఫోన్లలో మెసేజ్ చెక్ చేసుకుంటున్నారు. రైతు సాయం జమ కాకపోవడంతో కొంతమంది రైతులు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. త్వరగా రైతుబంధు సాయం జమ చేయాలని కోరుతున్నారు. పంట పెట్టుబడి కోసం అప్పులు చేసి యాసంగి పంట సాగు చేసి రైతులు రైతు బంధు సాయం కోసం నిరీక్షిస్తున్నారు.

గత వానాకాలంలో కూడా కొందరికి అందలే..

గత వానాకాలం సీజన్‌లో కూడా వేలాది మంది రైతుల వరకు రైతుబంధు డబ్బులు జమ కాలేదు. వివిధ సాంకేతిక కారణాల సాకుతో ఆ సీజన్ ముగిసే నాటికి కూడా డబ్బులు రాకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగినా వారికి సరైన సమాధానం రాలేదు. ప్రస్తుతం కూడా డబ్బుల జమ ప్రక్రియ నత్తనడకన సాగుతుండటతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సకాలంలో అందించాలి



నాకు 4.20 ఎకరాల భూమి ఉంది. యాసంగి కోసం ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రైతుబంధు డబ్బులు రాలేదు. ఎకరం లోపు వారికే సర్కార్ డబ్బులు జమ చేసింది. బీఆర్ఎస్ సర్కార్‌లో రైతుబంధు డబ్బులు వచ్చాయి. కొత్త సర్కారు కొలువుదీరాక ఎకరంలోపు రైతులకు రైతు బంధు డబ్బులు జమ చేసింది. రెండెకరాలపై వారికి పెట్టుబడి సాయం జమ కాలేదు. సకాలంలో రైతుబంధు జమ చేయాలి.

- వై.కృష్ణ, రైతు, చేవెళ్ల

నాకు రైతుబంధు జమ కాలేదు



నాకు ఐదెకరాల పొలం ఉంది. యాసంగికి సంబంధించిన రైతుబంధు ఇప్పటి వరకు ఇంకా జమ కాలేదు. రెండెకరాల రైతులకు వచ్చాయి. త్వరగా పెట్టుబడి సాయం అందివ్వాలి. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా రైతుబంధు సాయం అందించాలి.

- రమణారెడ్డి, రైతు, కేశంపేట

సాగు రైతులకే రైతుబంధు వేయాలి



నాకు నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. రైతుబంధు జమ కాలేదు. రెండు, మూడెకరాల భూమి ఉండి.. వారు వ్యవసాయం చేయకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఉన్న భూమి బీడు వదిలి పెట్టారు. అలాంటి వారికి రైతు బంధు డబ్బులు జమ య్యాయి. నాలాంటి రైతులకు జమ కాలేదు. పంటలు పండించే రైతులకే రైతుబంధు వేయాలి.

- మగ్బుల్, రైతు, చిలుకూరు, మొయినాబాద్ మండలం

విడతల వారీ జమవుతున్నాయి



రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దు. విడతల వారీగా అందరికీ రైతుబంధు డబ్బులు జమవుతున్నాయి. ముందుగా ఎకరం లోపు రైతులకు, తర్వాత రెండు, మూడు ఎకరాల్లోపు ఇలా అందరికీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

- గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

13 నుంచి మక్త మాదారంలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

» 6 రోజుల పాటు నిర్వహణ
» భక్తులకు వసతుల ఏర్పాటు



ఆలయంలో కొలువు దీరిన దేవతామూర్తులు



కడ్తాల్, ఫిబ్రవరి 4: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన కడ్తాల మండలం మక్తమాదారం వేణుగోపాలస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతి ఏటా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రానుండడంతో ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ నిర్వాహకులు వివరించారు. 13న స్వామివారికి అభిషేకం, స్వస్తీవాచనం, ఆంకురార్పణ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు., 14న నిత్య నిధి, ఆదివాసం, హోమం, ధ్వజారోహణం, గరుడ సేవ, భేరి పూజ, బలిహరణం, పల్లకీ సేవ ఉంటాయి. 15వ తేదీన నిత్యనిధి, బలిహరణం, మోహినీసేవ, గరుడ సేవ నిర్వహిస్తారు, 16న స్వామివారి కల్యాణోత్సవం, నిత్యనిధి, అభిషేకం, గజవాహన సేవ, సాయంత్రం రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయి. 17న గంధవళి ఉత్సవం, నిత్యనిధి, హోమం, బలిహరణం, లంకా దహనం, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. 18న పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతా విసర్జనం, ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని వింజమూరి రామానుజాచార్యులు కోరారు.

చేవెళ్ల ఎమ్మెల్యేకు కేటీఆర్ పరామర్శ



అనారోగ్యంతో నగరంలోని యశోద ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం పరామర్శించారు. ఆసుపత్రిలో యాదయ్య ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

చేవెళ్ల, ఫిబ్రవరి 4

ఈ దంపతులు.. క్రీడా దివ్వెలు!

బ్యాడ్మింటన్‌లో దూసుకెళ్తున్న సుమిత్‌రెడ్డి-సిక్కిరెడ్డి

» విజయాల బాటలో యాచారం క్రీడాకారులు
» దేశఖ్యాతిని చాటుతున్న భార్యా భర్తలు
» అర్జున అవార్డు అందుకున్న సిక్కిరెడ్డి



సిక్కిరెడ్డి

యాచారం, ఫిబ్రవరి 4 : రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి చెందిన బుస్సు సుమిత్ రెడ్డి-సిక్కిరెడ్డి దంపతులు బ్యాడ్మింటన్ పోటీల్లో దూసుకుపోతున్నారు. కఠోర శ్రమతో రాణిస్తున్న సిక్కిరెడ్డి అర్జున అవార్డు సొంత చేసుకొని యాచారం మండల ఖ్యాతిని ప్రపంచానికి చాటారు. నేలకూరి సిక్కిరెడ్డి నల్లగొండ జిల్లా కోదాడ వాసి. ఆమెకు యాచారం మండలంలోని గున్‌గల్‌కు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుమిత్‌రెడ్డితో 2019లో వివాహం జరిగింది. కాగా, బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్, ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో దంపతులు దూసుకుపోతున్నారు.

సిక్కిరెడ్డి సాధించిన విజయాలు

సిక్కిరెడ్డి 2016లో బ్రెజిల్, రష్యన్ ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్ టైటిల్ మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొని విజయం సాధించారు. 2014లో ఢిల్లీలో జరిగిన మహిళల ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో, 2016లో కున్‌షిన్, షిల్లాంగ్, ఖాట్మండ్‌లలో జరిగిన మహిళల ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 2018లో మహిళల డబుల్స్‌లో ఏషియన్ ఛాంపియన్‌షిప్ సాధించారు. 2019లో ఖాట్మండ్‌లో జరిగిన మహిళల ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో విజయం సాధించారు. 2014లో దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో జరిగిన ఉబెర్ కప్ పోటీల్లో కాంస్య పతకం, 2016లో న్యూఢిల్లీలో ప్రణయ్‌చోప్రాతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో బ్రెజిల్, రష్యా ఓపెన్ గ్రాండ్ ప్రిక్స్ టైటిల్స్‌ను సైతం దక్కించుకున్నారు. 2016లో దక్షిణాసియా, గౌహతి, షిల్లాంగ్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించారు. 2018లో నిర్వహించిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో గోల్డ్‌కోస్ట్ మిక్స్‌డ్ టీంలో పాల్గొని బంగారు పతకం సాధించారు. 2018లో అశ్విని పొన్నప్పతో కలిసి ప్రత్యర్థి సెట్యనమనసతోను ఓడించి కాంస్యం సాధించారు. 2018లో నిర్వహించిన సౌత్‌ఏషియా క్రీడల్లో మనీషాతో కలిసి జ్వాలాగుత్తా, అశ్విని పొన్నప్పలను ఓడించి కాంస్య పతకం సాధించారు.



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అర్జున అవార్డు అందుకుంటున్న సిక్కిరెడ్డి (ఫైల్)

2019లో ఖాట్మండ్‌లో మహిళల ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని బంగారు పతకం సాధించారు. కాగా, ఆమె సాధించిన విజయాలకు కేంద్ర ప్రభుత్వం 2018లో అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి సిక్కిరెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.

సుమిత్‌రెడ్డి సాధించిన విజయాలు

సుమిత్‌రెడ్డి యాచారం మండలంలోని గున్‌గల్‌లో బస్సు చంద్రభాస్కర్‌రెడ్డి, నిర్మల దంపతులకు 1991 సెప్టెంబరు 26న జన్మించారు. సుమిత్‌రెడ్డి చిన్నప్పటి నుంచి బ్యాడ్మింటన్‌లో శిక్షణ తీసుకున్నారు. 2018లో మలేషియాలో జరిగిన పురుషుల సింగిల్స్‌లో లీచాం గ్వేయ్‌ను ఓడించి బంగారు పతకం సాధించారు. కొరియా, మలేషియా, సౌత్‌కొరియా తదితర దేశాల్లో నిర్వహించిన చాంపియన్‌షిప్‌లలో పాల్గొని ప్రతిభ చాటారు. 2016లో హైదరాబాద్, గౌహతి, షిల్లాంగ్, ఖాట్మాండ్‌లలో జరిగిన పోటీల్లో పాల్గొని అద్భుత ప్రదర్శన కనబరిచారు. 2014లో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన సింగిల్స్ ఆరంభ రౌండ్లో సుమిత్ గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాలో సీడెడ్ ఆటగాడిని ఓడించిన మొదటి భారతీయుడిగా పేరు సంపాదించారు. కాగా, 1989లో ఆస్ట్రేలియా ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని రెండో రౌండ్లోనే భారత్ తరఫున భారత ఆటగాడు రమేష్‌కృష్ణన్ నాటి డిఫెండింగ్ ఛాంపియన్ మాట్స్ విలాండర్(స్వీడన్)పై విజయం సాధించారు. కాగా, 2024 జనవరిలో జరిగిన అదే ఛాంపియన్‌షిప్‌లో సుమిత్‌రెడ్డి ప్రత్యర్థిపై విజయం సాధించిన రెండో ఆటగాడిగా గుర్తింపు పొందారు. బ్యాడ్మింటన్‌లో దేశఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పడానికి సిక్కిరెడ్డి-సుమిత్‌రెడ్డి దంపతులు ఎంతగానో శ్రమిస్తున్నారు. ఈ యేడాది జనవరిలో ఆస్ట్రేలియా ఓపెన్‌లో సుమిత్‌రెడ్డి సంచలన విజయంతో మొదటి రౌండ్‌లోనే 27వ ర్యాంక్ సాధించడం విశేషం. ఇటీవల సిక్కిరెడ్డి-సుమిత్‌రెడ్డి దంపతులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వారి స్ఫూర్తితో యువతకు పలు క్రీడల్లో శిక్షణ ఇప్పించేందుకు పలువురు చేయూతనిస్తున్నారు. సాధారణ కుటుంబంలో పుట్టిన ఆ దంపతులు బ్యాడ్మింటన్‌లో రాణించడం అభినందనీయమని పలువురు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సుమిత్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, ఫిబ్రవరి 4: మండలంలోని అనంతసాగర్ గ్రామంలో మృతురాలి కుటుంబానికి పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన చిల్ల పుల్లమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మహేశ్‌రెడ్డి

సీడీపీవోగా అర్హత సాధించిన పంచాయతీ కార్యదర్శి నీరజ

పూడూరు, ఫిబ్రవరి 4: మండలంలోని బాకాపూర్ పంచాయతీ కార్యదర్శి నాంచేరి నీరజ ఇటీవల వెలువడిన ఫలితాల్లో సీడీపీవోగా అర్హత సాధించారు. నీరజ సొంత గ్రామం మండలంలోని కండ్లపల్లి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతోపాటు తోటి పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు. మల్టీజోన్-2లో ఆమెతోపాటు మరో ఐదుగురు అర్హత సాధించారు.


నాంచేరి నీరజ

యాలాల ఎస్‌ఐకి సన్మానం

యాలాల, ఫిబ్రవరి 4: యాలాల మండల నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన శంకర్‌ను కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరి మల్కయ్య ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ మండలంలో బాగా పనిచేసి మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు బాలు, జి.బాలు, ఇమ్రాన్ పాల్గొన్నారు.


యాలాల ఎస్‌ఐని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

వైభవంగా ఊరడమ్మ బోనాలు

బషీరాబాద్, ఫిబ్రవరి 4: మండలంలోని నవాంద్గీ గ్రామంలో గ్రామ దేవత (ఊరడమ్మ) బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. మహిళలు బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి బోనాలతో చేరుకున్న మహిళలు ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేసి గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ దేవతను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వీరమణిమాధవరెడ్డి, ఉప సర్పంచ్ శశిరేఖగోపాల్, గ్రామ పెద్దలు, యువకులు పలువురు పాల్గొన్నారు.


నవాంద్గీలో గ్రామ దేవత ఆలయం వద్ద భక్తుల సందడి

8న కొబ్బరికాయల విక్రయానికి బహిరంగ వేలం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 4: ఈనెల 8వ తేదీన తెలంగాణ రాష్ట్రంలో మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల వేలానికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు ఈనెల 29నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు రూ.80వేలు, ఒక సంవత్సరం కొబ్బరికాయలు విక్రయించేందుకు (వచ్చే నెల 16నుంచి వచ్చే సంవత్సరం బ్రహ్మోత్సవాలకు ముందు వారం వరకు) రూ.90వేలు చెల్లించాలన్నారు. లడ్డు, ప్రసాదం, పులిహోర విక్రయానికి బ్రహ్మోత్సవాల నుంచి వచ్చే సంవత్సరం బ్రహ్మోత్సవాలకు ముందు వారం వరకు రూ.30వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు మరిన్ని వివరాలకు 9010729852 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.


పోలెపల్లి ఎల్లమ్మ దేవత ఆలయం

మారుతీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడలోని మారుతీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీలో జరిగిన సమవేశంలో అధ్యక్షుడిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా బిక్షపతి, రామకృష్ణ, ప్రదానకార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శులుగా రాజ్‌కుమార్, సంజీవ, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, ప్రచారకార్యదర్శులుగా రమేష్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్‌రావు, శ్రీను, వెంకట్రాంరెడ్డి, రాజు, శ్రీరాములు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఘట్‌కేసర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్ అభినందించారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని పలుగ్రామాల్లో నేడు సోమవారం పలు అభివృద్ధి పనులను జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు ఎండీవో ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మర్రిపల్లిగూడ, మాదారం, ఎదులాబాద్ గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధుల నుంచి వేసిన సీసీరోడ్లను ఆయన ప్రారంభించనున్నట్లు తెలిపారు. అయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సకాలంలో పాల్గొనాలని తెలిపారు.

యాసంగి ఎవుసం సాగేదెలా?

- అదును దాటినా పూర్తవని నాట్లు
- ఆలస్యం వల్ల దిగబడులపై ప్రభావం
- వాతావరణ పరిస్థితులే కారణమంటున్న రైతులు

పరిగి, ఫిబ్రవరి 4 : 'అదును ఎరిగి సేద్యం.. పదును ఎరిగి పైరు' అన్నారు పెద్దలు. కానీ యాసంగి పంటల సాగులో మాత్రం అలా జరుగక.. నాట్లు వేయడంలో జిల్లా రైతులు వెనుకబడి ఉన్నారు. వరి నాటుకు అదును (సమయం) దాటిపోయింది. అయినా పలు చోట్ల ఆలస్యంగా నాట్లు పడుతున్నాయి. ఈ ఆలస్యం సీజన్ చివరలో పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సంక్రాంతి నాటికే వరినాట్లు పూర్తి కావాల్సి ఉండగా సమయం దాటి దాదాపు ఇరవై రోజులు కావస్తున్నా జిల్లాలో వరినాట్లు కొనసాగుతున్నాయి. పరిగి, దోమ, కులకచర్ల, బొంరాసిపేట్, యాలల్, తాండూరు మండలాల్లోని పలు గ్రామాల్లో వరినాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ సారి చాలా ఆలస్యమయిందని అధికార వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో అన్ని రకాల పంటలు కలిపి 79,957 ఎకరాల్లో సాధారణ సాగు ఉంటుందని అంచనా. 32,179 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 16 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నట్లు తెలిసింది.

నీరు, పెట్టుబడి అందకనే..

యాసంగికి ముందు వర్షాలు సరిగా కురువకపోవడం, నీటి లభ్యత తక్కువగా ఉండడంతో సకాలంలో నాట్లు పడలేదు. వాతావరణ పరిస్థితులు, కొత్త రుణాలు, రైతుబంధు అందకపోవడం కూడా పెట్టుబడుల ప్రభావం చూపిందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. డబ్బులు అందకపోవడంతో విత్తనాలు, ఎరువులు సకాలంలో కొనుగోలు చేయలేదు. రుణమాఫీ కాకపోగా ఆలస్యంగా సీజన్ ముగుస్తున్నా నేటికీ కొత్త రుణాల పంపిణీ అంతంతగానే ఉంది. బ్యాంకర్లు రుణాలు ఇవ్వక, ప్రైవేట్ అప్పులు దొరకకపోవడం వల్ల అన్నదాతలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిగ్గా నారు పోసే సమయంలోనే తీవ్రమైన చలిగాలులల వల్ల నారుమళ్ళు సరిగ్గా ఎదగలేదు. కొన్ని చోట్ల వాతావరణ పరిస్థితులు దెబ్బతీయగా, ఇంకొన్ని చోట్ల చలితీవ్రత కారణంగా నారు ఎదగలేదు. సకాలంలో ఎరువులు, పోషకాలు అందక చాలా చోట్ల నారు ఎండిపోవడం వల్ల మరోసారి నారు పోయడమూ పంట ఆలస్యానికి కారణమైందని రైతన్నలు వపోతున్నారు.

ఆలస్యం వల్ల నష్టమే..

వరిసాగు కాలం 120 రోజులు. నారు పోశాక నెల రోజులలోపు.. డిసెంబర్ ప్రారంభంలో నారు పోసుకుని, జనవరి మొదటివారంలో నాట్లు పడాలి. ఆ తర్వాత 90 రోజుల్లోపు.. మార్చి చివరినాటికి పంట కోతకు వస్తుంది. కానీ ఈ సారి ఆ పరిస్థితి లేదు. ఏకంగా నెలరోజులు ఆలస్యం కావడంతో ఏప్రిల్ చివరివారమో, మే మొదటివారమో పంట చేతికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్, మేలో వడగళ్ళ వానలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఆ సమయానికంటే ముందే కోతలను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. సరైన సమయంలో సాగు చేయకపోవడం వల్ల ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం, నీరందకపోవడం వల్ల గింజలు కుదురుకోకపోవడంతో తాలు గింజల శాతం పెరుగుతుందని చెబుతున్నారు. కారణంగా 10 నుంచి 20 శాతం పంట దిగుబడులు తగ్గే అవకాశాలు ఉంటాయని తెలుపుతున్నారు. ఆలస్యం చేయకుండా త్వరగా నాట్లను పూర్తి చేయాలని సూచిస్తున్నారు.



మిట్టకోడూరులో వరినాట్లు వేస్తున్న మహిళలు

నాట్లు ఆలస్యమయ్యాయి



ఈ సారి రబీలో వరినాట్లు వేలయం చాలా ఆసల్యమయింది. ఈ పాటికి కలుపుతీత పనులు చేయాలి. కానీ ఇంకా నాట్లు వేస్తూనే ఉన్నారు. సంక్రాంతి నాటికి వరినాట్లు పూర్తి చేయాలి. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల నీళ్ల సరిపోకపోవడం, అకాల వర్షాలు, వడగళ్ల వల్ల నష్టం జరిగే అవకాశం ఉంది.

-లక్ష్మీకుమారి, పరిగి వ్యవసాయ సహాయ సంచాకులు,పరిగి

నారు సరిగ్గా రాలేదు..



ఈ సారి నాట్లు వేయడం ఆలస్యమైంది వాస్తవమే. చలిగాలుల తీవ్రత వల్లనే నారు సరిగ్గా రాలేదు. ఆలస్యమైనా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. నీళ్ళు, వడగళ్ళ ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది.

-అంజనేయులు, రైతు,సుల్తాన్‌పూర్, పరిగి

పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్
- ప్రభుత్వం అండగా ఉంటుంది పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చీమ శ్రీనివాస్

చేవెళ్ల, ఫిబ్రవరి 4 : తెలంగాణ ఉద్యమకారులకు ద్రోహం చేసిన కేసీఆర్‌కు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటు ద్వారా సరైన బుద్ధి చెప్పాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ఉద్యమకారుల కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తెలంగాణ సంపదను దోచుకున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యమ కేసులకు సంబంధం లేకుండా తమకు ప్రభుత్వ ఫలాలు అందించాలని కోరారు. ప్రొ. కోదండరాంను చట్టసభల్లో అడుగుపెట్టకుండా బీఆర్ఎస్ పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధోగతి పాలు చేశారని విమర్శించారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉద్యమకారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి స్వయంగా తీసుకెళ్తానని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, మహిళ అధ్యక్షురాలు శ్యామల, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఉద్యమకారులు కరికె మల్లేశ్, రాములు, కటికె రమేశ్, మద్దూరి మల్లేశ్, కుమ్మరి చెన్నయ్య, పండిత్‌రావు, నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, మెగులయ్య, ఆశోక్, శివకుమార్, బాబా లక్ష్మీ, గోవర్ధన్‌రెడ్డి ఉద్యమకారులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అడ్వాణీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయం

- మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్



అడ్వాణీతో దేవేందర్‌గౌడ్ (ఫైల్)

మహేశ్వరం, ఫిబ్రవరి 4 : బీజేపీ అగ్రనేత, రాజకీయ కురువృద్ధుడు ఎల్‌కే అడ్వాణీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని ఉమ్మడి ఏపీ మాజీ హోంమంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు తూళ్ల దేవేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడ్వాణీకి భారతరత్న ప్రకటించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అడ్వాణీ కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్నప్పుడు తాను ఏపీ హోంమంత్రిగా ఉన్నానని, పలు సందర్భాల్లో ఆయనతో సన్నిహితంగా ఉంటూ పాలనాపరమైన సలహాలు తీసుకున్నానని చెప్పారు. అడ్వాణీ ఎంతో ఉన్నత వ్యక్తిత్వం కలిగిన గొప్ప నాయకుడని కొనియాడారు. నమ్మిన విలువల కోసం ఎంతో హుందాగా వ్యవహరించేవారన్నారు.

ఏడాదిగా సలహా సంఘం సమావేశాల్లేవ్

- నెలల తరబడి జరగని మీటింగ్‌లు
- కొత్త ప్రభుత్వంలోనైనా జరిగేనా ?



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి భవనం

తాండూరు, ఫిబ్రవరి 4 : అది 200 పడకలు కలిగిన.. జిల్లాలోనే పెద్దాసుపత్రి. దానికి ఓ సలహాసంఘముంది. కానీ ఆ సంఘం ఏడాదిగా సమావేశం కావడమేలేదు. ఆసుపత్రి సమస్యలపై చర్చించడమూ లేదు. అదే తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి. ఈ ఆసుపత్రి సలహాసంఘం అధ్యక్షురాలిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి కొనసాగుతున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఈ సంఘానికి కన్వీనర్‌గా, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సభ్యులుగా ఉన్నారు. ఈ సలహా సంఘం ప్రతి మూడు నెలకోసారి సమావేశం కావాలి. ఆసుపత్రిలో డాక్టర్లు, రోగులు, సిబ్బంది సమస్యలను ఈ సమావేశంలో చర్చించడంతో పాటు ఖాళీ పోస్టుల భర్తీ, అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి నివేదించాల్సిన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది. కానీ ఏడాదిగా సమావేశాలే జరుగలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఇప్పుడైన సలహాసంఘం సమావేశమవుతుందా? ఆసుపత్రి సమస్యలపై చర్చిస్తుందా? అనేది వేచి చూడాలి. మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి, ఇటీవల కొత్తగా మంజూరైన నర్సింగ్ కళాశాల ఈ ఆసుపత్రి పరిధిలోకి వస్తాయి. ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా సలహా సంఘ సభ్యుల్లో ఒకరుగా కొనసాగుతారు. ప్రస్తుతంసంఘం అధ్యక్షురాలిగా ఉన్న జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి పదవికాలం జూన్‌లో ముగుస్తుంది.

అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

- రాష్ట్ర అథ్లెటిక్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్



జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 4 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగి రికార్డులను సాధించాలని రాష్ట్ర అథ్లెటిక్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల అడుగుజాడల్లో నడవాలని, క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థులకు కావలసిన శారీరక, మానసిక ఉత్సాహం క్రీడల ద్వారానే సాధ్యమవుతుందని ఉపాధ్యక్షుడు ప్రభుదాస్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ ప్రతినిధులు వీరశేఖర్, రవి, మణికంఠ, హర్షవర్ధన్, సురేందర్, శ్యాంసుందర్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

హోరాహోరీ తలపడిన క్రీడాకారులు..

జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 200 మంది క్రీడాకారులు అండర్-8, 10, 12, 14 ఏజ్ గ్రూపుల్లో రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ పోటీల్లో పాల్గొని హోరాహోరి తలపడి ఒక్కో ఈవెంట్‌లో 25 మంది చొప్పున మూడు ఈవెంట్లలో 75 మంది క్రీడాకారులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వారికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, జాయింట్ సెక్రటరీలు అశోక్, దాయాలు, వీరశేఖర్ బహుమతులను ప్రదానం చేశారు.

10న కొత్తగూడెంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో గెలుపొందిన వారిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన 25 మంది క్రీడాకారులను ఈ నెల 10న కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌కు పంపుతామని రాజశేఖర్ వివరించారు. వారిని మేడ్చల్ జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు.

యాచారం బస్టాండ్‌లో వసతులు కరువు

- అధికారుల నిర్లక్ష్యం, ప్రయాణికుల అవస్థలు
- కరెంట్‌లేకపోవడంతో రాత్రయితే జంకు

యాచారం, ఫిబ్రవరి 4 : యాచారం బస్టాండ్‌లో సరైన వసతులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇన్నాళ్లు అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రాం విగ్రహాల ముందు బస్సులు ఆపడం వల్ల ట్రాఫిక్ స్తంభించి వాహనాదారులు ఇబ్బందులు పడడంతో పాటు తరచూ ప్రమాదాలు జరుగేవి. బస్టాండ్‌లో బస్సులు ఆపే విధంగా దేవరకొండ, ఇబ్రహీంపట్నం డిపోల మేనేజర్లు చర్యలు తీసుకోలేకపోయారు. ఇది గమనించిన యాచారం పోలీసులు, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్సై వెంకటయ్య డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి బస్టాండ్‌లోనే ఆపేలా చర్యలు తీసుకోవడంతో ఎట్టకేలకు బస్సులు ఆగుతున్నాయి. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, సీసీరోడ్డు, మంచినీరు, కరెంట్ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

యాచారంలో ప్రయాణికుల ఇబ్బందులను గమనించి మండల కేంద్రానికి చెందిన రెడ్డి జగన్ రెడ్డి 20 ఏళ్ల క్రితం ఎకరం భూమిని ఆర్టీసీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడంతో ప్రభుత్వం రూ.35లక్షల వ్యయంతో బస్టాండ్, మరుగుదొడ్లను నిర్మించింది. కానీ ప్రస్తుతం మరుగుదొడ్ల వద్ద చెట్లు పెరగడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ విషయంలో ఇబ్రహీంపట్నం డిపో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్‌లో విద్యుత్ వసతి లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడితే ఏం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డుతో పాటు విద్యుత్ వసతి కల్పించి, లైట్లు వేయించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ బస్టాండ్ భూమి విలువ రూ.మూడు కోట్లపైనే ఉంటుంది. బస్టాండ్‌ను వినియోగంలోకి తేవడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని పలువురు తప్పు పడుతున్నారు. బస్టాండ్ ముందు ఆర్టీసీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తే సంస్థకు ఆదాయం రావడంతో పాటు ప్రయాణికులకు మేలు జరుగుతుంది.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



యాచారం బస్టాండ్

సమస్యలను పరిష్కరిస్తాం



యాచారం గ్రామపంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. విద్యుత్ వసతి కోసం ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేశాం. సీసీ రోడ్డు నిర్మాణం విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. గ్రామపంచాయతీ నిధుల నుంచి వేయించేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో బస్టాండ్‌లో అన్ని రకాల వసతులు కల్పిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగాకుండాచర్యలు తీసుకుంటాం.

- బి.వెంకటనర్సప్ప, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్


హాజీపల్లి సర్పంచ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 4 : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ భరోసా ఇచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి, గిరాయగుట్టతండా తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని అందరూ గౌరవించాలని చెప్పారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు తమ పదవీ కాలంలో గ్రామాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా హాజీపల్లి సర్పంచ్ మౌనికను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మశ్చేందర్, రామకృష్ణ, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలను
విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న రవీందర్ నాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 4: శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర గిరిజన నాయకుడు రవీందర్ నాయక్ అన్నారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి గిరిజనులందరూ సహకరించాలని అన్నారు. జయంతి వేడుకల నిర్వహణపై ఆదివారం వివిధ గిరిజన సంఘాల నేతలు సమావేశం నిర్వహించారు. సేవాలాల్ జయంతి వేడుకలను గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ సర్పంచ్ అంబర్ సింగ్, ఉపసర్పంచ్ మల్లేశ్, శంకర్ కొండ మాజీ ఉపసర్పంచ్ ప్రశాంత్‌నాయక్, గిరిజన నాయకులు పత్యానాయక్, దశరథ్‌నాయక్, శ్రీనునాయక్, శంకర్‌నాయక్, గేమ్లనాయక్, సురేశ్, సూర్య తదితరులున్నారు.

న్యాయ్ యాత్రలో కాంగ్రెస్ నేతలు

తలకొండపల్లి, ఫిబ్రవరి 4 : ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి పాలమూరు ప్రగతి కోసం మక్తల్ నుంచి చేపట్టిన న్యాయ్ యాత్రలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వంశీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ధన్వాడ మండలంలో వంశీతో కలిసి న్యాయ్ యాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్ఫూర్తితో వంశీచంద్‌రెడ్డి చేపట్టిన న్యాయ్ యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. న్యాయ్ యాత్రలో పాల్గొన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, ఎంపీటీసీలు రమేశ్, సుధాకర్‌రెడ్డి, నాయకులు రాములు, విష్ణు, తిరుపతిరెడ్డి, చిత్తరంజన్, రమేశ్, వెంకట్, అమృత, జగ్గారెడ్డి, బషీర్, అంజిరెడ్డి, పెద్దయ్య, యాదయ్య, మురళీధర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం.. పోలీసులకు ఫిర్యాదు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 4 : ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలోని ఓ స్థలం విషయం వివాదంగా మారింది. దాంతో అదికాస్తా పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఎలికట్ట శివారులోని సర్వే నెంబర్ 456లో 20 గుంటల భూమిని సతీష్, అబ్బాస్ అనే వ్యక్తులు చెరో 10 గుంటల చొప్పున కొనుగోలు చేశారు. అయితే, ఆ భూమి తమకు వారసత్వంగా వచ్చిందని అదే గ్రామానికి చెందిన సురేష్, చిన్న బాలయ్య కుటుంబసభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థలానికి పాతిన రాళ్లను బాలయ్య కుటుంబ సభ్యులు తొలగించారు. దాంతో వివాదం మరింత ఎక్కువైంది. తాము చట్టపరంగా కొనుగోలు చేసిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి రాళ్లను తొలగించి నష్టం కలిగించారని అబ్బాస్, సతీస్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి

● జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు జ్యోతి


సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి భీంభరత్

చేవెళ్ల, ఫిబ్రవరి 4 : మహిళలు రాజకీయంగా ఎదగాలని జిల్లా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. రాబోయే రోజుల్లో మహిళల కోసం మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ నెల 10న చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా కార్యకర్తల సమావేశం చేవెళ్ల పట్టణ కేంద్రంలో పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని మండలాల నుంచి మహిళా కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ తదితర మండలాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లు దేవర సమతారెడ్డి, నాగమణి, అమృత, రమ్యశ్రీరెడ్డి, ప్రత్యూషరెడ్డి, అశ్విని, సునీశీల, ప్రధాన కార్యదర్శులు కళావతి, మంజుల, పుష్పమ్మ, దివ్య తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : ఏసీపీ


చేవెళ్ల : విజేతలతో ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, తదితరులు


కందుకూరు : బహుమతులను అందజేస్తున్న తాజా మాజీ సర్పంచ్ కాకి ఇందిరా ధశరథ

చేవెళ్ల, ఫిబ్రవరి 4 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, ఎస్వీవీఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి డబ్ల్యూ మాలతీరెడ్డి, చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ల గ్రామంలో గల సాగర్ అగ్రి బిజినెస్ కళాశాలలో ఖేలోత్సవ్-2024 వార్షిక ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ ఈవెంట్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, చెస్, కబడ్డీ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. వారు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహబంధాలు పెరుగుతాయని, గెలుపోటములను సహజంగా తీసుకోవాలన్నారు. క్రీడలతో శారీర ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. పట్టుదలతో చదువుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులున్నారు.

కందుకూరు : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న టోర్నమెంట్లలో యువత రాణించాలని అన్నోజిగూడ మాజీసర్పంచ్ ఇందిరాధశరథ కోరారు. మూడురోజుల పాటు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు. నిర్వాహకులు సుధాకర్, జి.రామకృష్ణ, రఘురాంరాథోడ్, డిల్లీ శివకుమార్, శ్రీకాంత్, భాను తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవీందర్ నాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 4: వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్ నాయక్ కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద ఆదివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ రవీందర్‌నాయక్ హాజరై ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులకు వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు విధిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ నేరమని ఆయన సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు చోటుచేసుకుంటే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తప్పవన్నారు. వాహనదారులు విధిగా లైసెన్స్ పొందాలని, ఓవర్ లోడ్‌తో ప్రయాణం చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

సీఎంను కలిసిన విజయభాస్కర్ రెడ్డి



కడ్తాల్, ఫిబ్రవరి 4:మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ ఛైర్మన్, ప్రముఖ బిల్డర్ కోర్సే లు విజయభాస్కర్ రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సమాజ శాంతి కోసం పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న జ్ఞాన కార్యక్రమాల గురించి సీఎంకు వివరించినట్లు చెప్పారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

● తాజా మాజీ సర్పంచ్‌లు ● ఘనంగా సన్మానం


మొయినాబాద్ : నరోత్తంరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు, స్నేహితులు

చేవెళ్ల, ఫిబ్రవరి 4 : అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమైందని, పదవి ఉన్నా లేకున్నా తనవంతు సహాయ సహకారం అందిస్తానని దేవుని ఎర్రవల్లి తాజా మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో పదవీ విరమణను పురస్కరించుకొని సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని మాణిక్యరెడ్డిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానని చెప్పారు. వార్డుసభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

మొయినాబాద్ : ప్రజలందరి సమకారంతోనే గ్రామాన్ని అభివృద్ధి చేయగలిగానని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు, పెద్దమంగళారం మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి అన్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తికావడంతో గ్రామస్తులు, స్నేహితులు ఆదివారం ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తనకు ప్రతీ ఒక్కరు సహకరించారని తెలిపారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. బి.నారాయణరెడ్డి, ఎం.చంద్రమోహన్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, దాన్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, వెంకటేష్, నర్సిలు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని నక్కలపల్లి తాజా మాజీ సర్పంచ్ స్వప్న అంజయ్యగౌడ్‌తో పాటు పాలకవర్గాన్ని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

కేశంపేట : పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కేశంపేట మండలం చింతకుంటపల్లి గ్రామ పంచాయతీ తాజా మాజీ పాలకవర్గాన్ని గ్రామ ఠాగూర్ యువజన సంఘం సభ్యులు కొనియాడారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తాజా మాజీ పంచాయతీ పాలకవర్గం మాజీ సర్పంచ్ పోచమోని పార్వతమ్మ జంగయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ్ పద్మ, వార్డు సభ్యులు రాఘుమారెడ్డి, గిరిజ, బీపాసా, సంజీవ, ప్రవీణ్, పద్మ, రమేష్, కార్యదర్శి శేఖర్, గ్రామానికి చెందిన మహేశ్వరం అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీదేవిలను సన్మానించారు. యూత్ సభ్యులు తులసీరాం, మహేందర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన చింతకుంటపల్లిని ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. అనంతరం యూత్ సభ్యులకు మాజీసర్పంచ్ బ్యాట్, బాల్‌లను బహూకరించారు. రమేష్, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీనివాస్, పారేశ్, కొండల్‌రెడ్డి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : దేవుని ఎర్రవల్లి తాజా మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు


కేశంపేట : సన్మానం పొందిన తాజా మాజీ పాలకవర్గంతో ఠాగూర్ యూత్ సభ్యులు

సీఐ మక్బూల్ జానీకి సన్మానం



కందుకూరు, ఫిబ్రవరి 4 : కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మక్బూల్ జానీని హ్యూమన్‌రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆ సంస్థ నేతలతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తా, జిల్లా కార్యదర్శి మల్లేష్, నాయకులు సత్తిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ ఎస్సై వరప్రసాద్‌కు..


వరప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 4: కడ్తాల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివశంకర వరప్రసాద్‌ను ఆదివారం తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో వరప్రసాద్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రేవంత్‌గౌడ్, శివ, సాయి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలి

యాచారం, ఫిబ్రవరి 4: కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కుర్మిద్దలోని వార్డుల్లో ఆయన తిరిగి ఈ నెల 16న నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను కేంద్రప్రభుత్వం నియంత్రించలేకపోతుందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత విస్తరించపోవడంతో మారుమూల గ్రామాల్లో జనాలకు రేషన్ బియ్యం అందడం లేదన్నారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలందించడంతో పాటు గుడిసెలు, తాత్కాలికంగా ఇళ్లు కట్టుకున్నవారికి పట్టాలందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చందూనాయక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్నిరంగాల్లో రాణించాలి

కందుకూరు, ఫిబ్రవరి 4 : యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పసుపుల పర్వతాలుయాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన యాదవులకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యతనివ్వాలని కోరారు. నాయకులు కన్నయ్యగారి బాల్‌రాజ్ యాదవ్, సాటు మైసయ్య, నర్ల నర్సింహయాదవ్, రామకృష్ణయాదవ్, చెన్నయ్యయాదవ్, అంజయ్య యాదవ్, జనార్ధన్‌యాదవ్, ఆంజనేయులుయాదవ్, రాజశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పర్వతాలు యాదవ్

సంక్షిప్తంగా..

● **మంచాల :** మంచాల జిల్లాపరిషత్ హైస్కూల్‌కు చెందిన 1989-90బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని శ్రీకళ కన్వెన్షన్ హాల్‌లో 102 మంది పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటాపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు దండేటికార్ రవి, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్, మహిపాల్‌రెడ్డి, వెంకటేష్, అనిత, విజయలక్ష్మి, అపర్ణ, జలజ, కవిత, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

● **యాచారం :** మండలంలోని మేడిపల్లినక్కర్త గ్రామంలో ఇటీవల జరిగిన ఎంఎన్‌పీఎల్ సీజన్-3లో క్రికెట్ రన్నరప్ జట్టు ప్రజలు కూర్చునేందుకు ఆదివారం ఉదయం గ్రామంలో పలుచోట్ల సిమెంట్‌తో తయారుచేసిన బెంచ్‌లు ఏర్పాటుచేశారు. క్రికెట్ పోటీలో గెలుపొందిన నగదుతో బెంచ్‌లు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి చొరవ తీసుకుంటామని టీమ్ సభ్యులు ప్రకటించారు.

● **షాబాద్ :** షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు నాందార్‌ఖాన్‌పేట్ గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో కలుసుకొని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. చిన్న తనంలో ఏర్పడిన స్నేహబంధం ఎప్పటికీ మరిచిపోనిది, విడదీయరానిదని గుర్తుచేసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ, కుటుంబాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారు ఒక్క చోటికి రావడం ఆనందానికి అవధులు లేకుండా పోయింది. పూర్వవిద్యార్థులు విద్యాసాగర్‌గుప్తా, మాణిక్యం రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,సత్యం, మోహన్‌రావు, యాదగిరి, కృష్ణ, రాజేందర్‌రెడ్డి, విఠల్, కవిత, సువర్ణ తదితరులున్నారు.

● **తలకొండపల్లి :** కల్వకుర్తి పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి తలకొండపల్లి జడ్పీటీసీ వెంకటేశ్ చేయూతనందించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 లక్షల విలువచేసే మెటీరియల్‌ను ఆయన సమకూర్చారు. ఆదివారం ట్రస్ట్ సభ్యులు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి చేయూతనందించిన వెంకటేశ్ ను నిర్వాహకులు, భక్తులు అభినందించారు.

● **ఆమనగల్లు :** పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని కేఎస్ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు విజయ్ రాథోడ్ అన్నారు. ఉద్యోగ ధర్మాన్ని అంకిత భావంతో నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల్లోకీర్తించబడుతారని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన పత్యానాయక్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆదివారం పదవీ విరమణ వీడ్కోలు సభ నిర్వహించారు. పత్యానాయక్ దంపతులను విజయ్‌రాథోడ్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు, శాలువాతో సత్కరించి అందించిన సేవలను కొనియాడారు. ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, తండానాయకులు బ్యాంక్ ఉద్యోగులున్నారు.

● **కందుకూరు :** కాంగ్రెస్ పార్టీ మీర్కాన్‌పేట గ్రామ అధ్యక్షుడిగా గ్రామ మాజీ సర్పంచ్ డేరంగుల నర్సింహను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జులు కె.మధన్‌పాల్‌రెడ్డి, ఎ.జగదీష్‌బాబు, కాకి చిన్న నర్సింహులు ప్రకటించారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశం అనంతరం వారు మాట్లాడారు. పార్టీకి పూర్వవైభవం తీసుకు రావడానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి గెలుపునకు కృషి చేయాలన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

షాబాద్, ఫిబ్రవరి 4 : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన బర్ల నీలమ్మ(40) భర్త మల్లేష్ చిన్న చిన్న విషయాలకే తరచూ గొడవపడేవారు. చాలాసార్లు పెద్దల సమక్షంలో మాట్లాడుకొని రాజీకి వచ్చిన ఘటనలున్నాయి. కాగా, గ్రామస్తుల సమాచారం ప్రకారం.. మృతురాలు ఇంతకుముందు నాలుగు సార్లు ఆత్మహత్యకు ప్రయత్నించిందని, మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతూనే ఉండేవని చెప్పారు. ఈక్రమంలో నీలమ్మ శనివారం వంటగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని మృతిచెందింది. మృతురాలి మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని, మృతిరాలి సోదరి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తి..

షాబాద్, ఫిబ్రవరి 4 : మద్యం సేవించిన వ్యక్తి వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని బోడంపహాడ్‌కు చెందిన ఉప్పరి బాలకృష్ణయ్య(53) గ్రామపంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం సర్దార్‌నగర్ బ్యాంకులో పని ఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పని ముగించుకొన్న తరువాత వైన్‌షాపు వద్ద మద్యం పూటుగా సేవించి ఇంటికి వచ్చి పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుమారుడు శివ గమనించి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తా


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 4: ప్రతిభ గల క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా తోడ్పాటునందిస్తానని అన్నారు. ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ తరపున పూలమాలలు, శాలువాలతో కసిరెడ్డిని సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలో బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించి నిర్మాణం చేయించాలని ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏబీఏ ప్రధాన కార్యదర్శి మల్లేశ్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్, సభ్యులు పర్వతాలు, పాపిశెట్టి అరవింద్, బానాంత్ రవి, తిరుపతి, అప్పం శ్రీను, ప్రసాద్, యాదయ్య, దేవ, జంగయ్య, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలు ఎంతో ముఖ్యం : వీర్లపల్లి


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చౌదరిగూడ, ఫిబ్రవరి 4: యువతకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఎల్-4 ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మ్యాచ్‌లను ఆన్‌లైన్లో చూసే వెసులుబాటు కల్పించడం హర్షించదగ్గ విషయమని ఆర్గనైజర్స్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు రాజు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, యాదయ్య, నర్సింహులు, ఏజాజ్, వెంకట్‌నర్సింహరెడ్డి, అన్వర్, వేణుగోపాల్, మోహన్, చంద్రబాబుగౌడ్, అజ్జు, గిరిధర్, శశిధర్, చందునాయక్, అంజనేయులు ఆర్గనైజర్లు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హాఫీజ్, జబ్బార్, ఇస్మాయిల్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ చేరవేయాలి


మాట్లాడుతున్న రాఘురాములు గౌడ్

కేశంపేట, ఫిబ్రవరి 4: గావ్ గావ్ చలో, ఘర్ ఘర్ చలో కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ చేరవేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రొల్లు రాఘురావులు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ విస్తారక్ శ్రీకాంత్‌జీ, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి సొప్పరి నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు శివాజీ, బండ వెంకటేష్, ఐలయ్య, హరికృష్ణ, రావుల శ్రీనివాస్, శివశంకర్ గౌడ్, శేఖర్, భిక్షపతి, కృష్ణయ్య, మహేష్, రాజు, రాము నాయక్, శ్రీకాంత్ తదితరులున్నారు.

నేడు మున్సిపల్ కార్మికుల సమ్మె

ఆమనగల్లు, ఫిబ్రవరి 4: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై నేడు(సోమవారం) కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా నాయకులు వగ్గు రవిలు తెలిపారు. ఈమేరకు ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, కార్మికులకు ఇళ్లు, వివిధ సమస్యల పరిష్కారానికి సమ్మె చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు, మున్సిపల్ కార్మికులు సుధాకర్, జంగయ్య, యాదమ్మ, బాలమణి, లక్ష్మమ్మ, జంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 4: ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు అహంకార పోకడలు వీడడం లేదని డీసీసీ ఉపాధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. అధికారం కోల్పోయామన్న బాధతో ఆ పార్టీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన సుద్దపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు గౌడ్‌కు ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొప్పుల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వెంకటేశ్వర్లుగౌడ్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంచి కేంద్రంలో అధికారం చేపడుతుందని అన్నారు. ఎన్నికల్లో పార్టీ శ్రేణులంత విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. సైదులు, షరీఫ్, అంజయ్య దశరథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర్లుగౌడ్‌ను సన్మానిస్తున్న శేఖర్ గౌడ్, నాయకులు